# అదృష్ట హీనుడు



*ఎవరు దొంగో, ఎవరు దొరో కనుక్కోలేము బాహ్యావేషాలనుబట్టి. వృద్ధుడైన మేస్టారు రైలుప్రమాదంలో రూపే మారిపోయి, బికారి వేషంలో ఉన్న తన కుమారుణ్ణే గుర్తించక దొంగ అనుకుంటాడు. తీరా, కుమారుడని తెలిసిన తర్వాత ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయి ప్రాణాలే కోల్పోతాడు. అదృష్టహీనుడు!*

**అది** భయంకర కాళరాత్రి!

ఆకాశంలో కారుమబ్బులు దట్టంగా అలుముకున్నాయి. ఫెళఫెళా ఉరిమే ఉరుములు, తళతళా మెరిసే మెరుపులు గుండెలు తోడేస్తున్నాయి. చల్లని గాలితెరలు రివ్వు రివ్వున వీస్తున్నాయి. చిటపట చినుకులు కూడా ప్రారంభించినాయి.

ఆ చిమ్మచీకట్లో తడుములాడుకుంటూ రైల్వేస్టేషన్‌కేసి నడుస్తున్నాడొక వృద్ధుడు. అతడు స్టేషన్ దరిదాపుకు చేరుకునేసరికే వర్షం పెద్దదయింది. వృద్ధుడు పడుతూ లేస్తూ ఎలాగో స్టేషన్‌లోకి చేరుకున్నాడు. కోటు తీసి మూడవ తరగతి వెయిటింగ్ రూములోని చెక్క బెంచీమీద ఆరవేసి, "హమ్మయ్య" అంటూ కూలబడ్డాడు. ఓమాటు హాలంతా కలయజూచాడు. అతని గుండెలు బరువెక్కాయి. 'ఈ రైలు ఎప్పుడొస్తుందో! నా అదృష్టం మండితే తెల్లవారిపోవచ్చు. అంతదాకా ఈ భయంకర వాతావరణంలో, ఈ వెయిటింగ్ రూములో ఒంటరిగా గడపడం ఎలా చెప్మా!' అనుకుంటూ పక్కకు తిరిగాడు. బుకింగ్ కౌంటర్ కెగువ గోడ మీద నల్లరంగుతో వ్రాయబడిన అక్షరాలు అతని కంటబడ్డాయి. అతని గుండెలు గుబగుబలాడాయి. కంగారుగా జేబులు తడుముకున్నాడు. తనవెంట తెచ్చిన కాన్వాస్ బాగ్ జిప్ తెరిచి, అందులోని బట్టలన్నీ బయటికి లాగి, బెంచీమీద విరజిమ్మాడు. అతనిక్కావలసిందేదో అతనికి దొరకలేదు. హతాశుడై తల పట్టుకుని బెంచీమీద కూలబడ్డాడు.

అతని ముఖంలో విచారజీమూతాలు అలుముకున్నాయి. అతని కళ్ళు శూన్యంలోకి చూస్తున్నాయి. బుర్ర ఎక్కడో పని చేస్తున్నది.

ఒకే ఒక్క నిమిషం గడిచింది. అతని మెదడులో ఏదో కలుక్కుమంది. అతని ముఖంలో సంతోషరేఖలు ఉదయించినాయి. కళ్లల్లో కాంతులు మెరిసినాయి.

"ఆఁ అవును" అని గొణుక్కుంటూ బెంచీ మీదనుంచి లేచి, ఒక్క అంగలో ఆరవేసివున్న కోటు వద్దకు చేరుకున్నాడు. జేబులు వెతికి పర్సును బయటికి తీశాడు. 'హమ్మయ్య! వట్టి పుణ్యానికి ఎంతగా కంగారు పడిపొయ్యాను!' అని గొణుక్కుంటూ పర్సును చొక్కాజేబులో పెట్టుకుని, బెంచీమీద విరజిమ్మబడిన బట్టలను బాగ్‌లో

వి. ఎస్. చెన్నూరి

వర్దాడు. చొక్కాజేబులోని పర్సును బాగ్‌లో పెట్టబోయి, ఎందుకయినా మంచిదని పర్సు లోని నోట్ల కట్టను బయటికి లాగి లెక్కపెట్ట సాగాడు.

ఇంతలో మాసిన తల, ఎదిగినగడ్డంతో చిరిగిన చొక్కా, పొట్టినిక్కరూ తొడుక్కున్న ఓ పన్ను పాటి వ్యక్తి తప్పతడిపి, బయటినుండి వెయిటింగ్ రూములోకి చేరుకున్నాడు. వృద్ధుడు అతని రాకను గమనించలేదు. ఆగంతకుడు వృద్ధుడి చేతిలోని నోట్లకట్టను చూచి హఠాత్తుగా ఆగి పొయ్యాడు. ఏమనుకున్నాడో ఏమో, వెంటనే అటూ ఇటూ దొంగచూపులు చూస్తూ పిల్లిలా ప్లాట్‌ఫాంకేసి జారుకున్నాడు.

వృద్ధుడు నోట్లకట్టను పర్సులో దాచి, పర్సును బాగ్‌లో భద్రంచేసి, గోడమీది అక్షరాల కేసి చూచి, 'ఇక్కడ దొంగలున్నారట. దొంగలు! హుఁ' అని మనసులోనే నవ్వుకున్నాడు. రొంటి నుండి పొడుంకాయ తీసి అరచేతిలోకి రాల్చుకుని, గట్టిగా ఓ పట్టు లాగి, పై పంచతో ముక్కు తుడుచుకుంటుండగా బూట్లుచప్పుడు చేసు కుంటూ తలపై హాటూ, రెయిన్ కోటూ తొడుక్కున్న ఓ వ్యక్తి అక్కడికొచ్చాడు.

తోడు దొరికాడనే సంతోషంతో వృద్ధుడి ముఖం వికసించింది. "రా, బాబూ రా. ఒంటరిగా ఎలా గడపడమా అని ఆలోచిస్తున్నాను. ఎందాకా బాబూ? మద్రాసుకేనా?" అని అడిగాడు.

"ఆఁ అవును. మీరూ మద్రాసుకేనా?" అంటూ చేతనున్న లెదర్‌కేసును బల్లమీద పెట్టి, రెయిన్‌కోటు బొత్తాములు విప్పసాగాడు నవ యువకుడు.

"అవును బాబూ, అవును. కూచో బాబూ" అన్నాడు వృద్ధుడు ఆప్యాయంగా.

యువకుడు రెయిన్‌కోటు తీసి బెంచీమీద వేసి వృద్ధుడి ప్రక్కన కూర్చున్నాడు. "మీరు మద్రాసుకి వ్యాపారంమీద వెళుతున్నారా?" అని ప్రశ్నించాడు, బెంచీకి చేరగిలబడుతూ.

"లేదు బాబూ, లేదు....."

"ఉద్యోగమా?"

"ఆహాఁ! ఈ వయసులో ఇంకేం ఉద్యోగం బాబూ! చేసినన్నాళ్లూ చేశాను పల్లెటూరి బడి పంతులు ఉద్యోగం. చాకిరీచెర వదిలించుకుని ఆరు మాసాలు దాటుతోంది. ఇప్పుడు నేను స్వేచ్ఛా జీవిని బాబూ, స్వేచ్ఛాజీవిని."

"అయితే బంధువులింటికి వెళుతున్నారా?"

"లేదు బాబూ, లేదు. నాకీ ప్రపంచంలో నా అన్నవాళ్లెవరూ లేరు." వృద్ధుడి కళ్లల్లో నీళ్లు తిరిగాయి. "చివరికి నా సత్యంకూడా నన్ను ఒంటరివాణ్ణి చేసి వెళ్లిపొయ్యాడు. మోసం చేసి వెళ్లిపొయ్యాడు." అతని గొంతుక పూడి పోయింది.

"మోసం చేశా?" యువకుడు వృద్ధుడి ముఖంలోకి చూచాడు.

"అవును బాబూ, అవును. మనం ఎవరి ఔన్నత్యంకోసం కలలుగంటూ కూర్చుంటామో, ఎవరి బాగుకోసం మన సర్వస్వాన్నీ వెచ్చిస్తామో అలాంటి వ్యక్తి మన విధికి మనల్ని వదిలిపెట్టి తనదారిన తాను వెళ్లిపోతే దాన్ని మోసం అనరా, బాబూ?"

"ఇంతకీ, ఆ వ్యక్తెవరు మేస్టారూ?"

"ఇంకెవరు బాబూ, మావాడే. నా ఒక్కగా నొక్క కొడుకు. మద్రాసులో చదువుతూ ఉండే వాడు. నా ఆశంతా వాడిమీదే పెట్టుకుని జీవించేవాణ్ణి. వాడు పెద్దచదువులు చదవాలనీ, హోదాగా బ్రతకాలనీ కలలుగనేవాణ్ణి. కాని, నా ఆశలు ఫలించలేదు బాబూ! ఫలించలేదు! దైవం ఎదురుతిరిగింది. ఆయిదేళ్ల క్రితం సరిగ్గా ఈ వేసవిసెలవుల్లోనే బియ్యే పరీక్షకి వ్రాసి ఇంటికి వస్తుండగా దారిలో వాడెక్కిన రైలు కాస్తా తల్లక్రిందులై నా జీవితాశయా లనే తల్లక్రిందులు చేసింది. ఆ మహమ్మారి ఎందరు తల్లుల్ని పిల్లల్నుంచి దూరంచేసిందో, ఎందరు భర్తల్ని తమ భార్యలనుంచి విడదీసిందో ఆ పరమాత్ముడికే ఎరుక! చివరికి తన బిడ్డడి శవాన్ని తన చేతులారా దహనంచేసే అదృష్టానికి కూడా ఈ దురదృష్టవంతుడు నోచుకోలేక పొయ్యాడు."

"అయితే, పాపం మనశ్శాంతిని వెతుక్కుంటూ బయలుదేరారన్నమాట?" యువకుడు సాను భూతిగా నిట్టూర్చాడు.

"అవును బాబూ, అవును. ముప్పైఏయేళ్ల పాటు బడిపంతులుగా నేను చేసిన చాకిరీకి ప్రతి ఫలంగా ప్రభుత్వంవారు మంజూరుచేసిన ప్రావి డెంటు ఫండుతో చివరి అమ్మాయి కన్నెచెర కాస్తా వదిలించాను. మిగిలిన వెయ్యి రూపా యలూ చేతబట్టుకుని బయలుదేరాను. ఆ జానెడు భూమీ ఎక్కడ వ్రాస్తేమో అక్కడే చాలిస్తుందీ తనువు." వృద్ధుడు చెమర్చిన కళ్లను పైపంచతో తుడుచుకున్నాడు.

ఇంతలో గణగణమని గంట మోగింది. వృద్ధుడు కంగారుగా బెంచీమీదనుంచి లేచి పంచీ చేతికి తీసుకున్నాడు. కోటును అందుకో బొయ్యాడు.

"అదేమిటి, మేస్టారూ? ఎక్కడికి బయలు దేరుతున్నారు?" అని ప్రశ్నించాడు యువకుడు, వింతగా అతనికేసి చూస్తూ.

"ఇంకెక్కడికి? మన బండికేగా గంట కొట్టింది?"

"కాదు మేస్టారూ. కూర్చోండి. ఉత్తరం వెళ్లే బండి రాందే మన బండెలా వస్తుంది? ఇప్పుడు కొట్టిన గంట ఉత్తరమెళ్లే బండికి."

"అలాగా? అవును మరి, అప్పుడే ఎలా వస్తుంది మన బండి?" వృద్ధుడు తాపీగా కూర్చున్నాడు.

యువకుడు గట్టిగా ఆవులించాడు. "నిద్ర ముంచుకొస్తోంది. అలా ప్లాట్‌ఫాంమీదికెళ్లి యిన్ని టీనీళ్లు గొంతులో పోసుకోందే నిద్ర ఆగదు. బయట ... కూడా ఆగివస్తుంది. వస్తారా మేస్టారూ?" బెంచీమీదనుంచి లేస్తూ వృద్ధుడికేసి ప్రశ్నార్థకంగా చూచాడు.

"వద్దులే బాబూ. నాకు టీలూ, కాఫీలూ అలవాటు లేదు" అంటూ వృద్ధుడు రొంటి నుండి పొడుంకాయ బయటికి తీశాడు.

"అవును మరి. మీ నస్యంముందు టీలూ, కాఫీలూ, యివేమీ ఆగవుగా? వస్తా!" అంటూ యువకుడు తన లెదర్‌కేసూ, రెయిన్‌కోటూ తీసుకుని ప్లాట్‌ఫాంకేసి నడిచాడు.

వృద్ధుడు ఏమీ తోచక గదిలో పచార్లు చేస్తున్నాడు. ఎక్కడినుంచో "దొంగ! దొంగ!" అన్న కేకలు వినిపించినాయి. వృద్ధుడు కంగారు పడిపొయ్యాడు. ఒక్క అంగలో తన హాండ్‌బాగ్ వద్దకు చేరుకుని, జిప్‌తెరిచి, పర్సును బయటికితీసి చేతిలో గట్టిగా పట్టుకున్నాడు. గజగజ లాడి పోతూ కేకలు వినిపిస్తున్న దిక్కుకేసి చూస్తూ నిర్ఘాంతపొయ్యాడు.

## అందము

**సి. నారాయణరెడ్డి**

వెన్నెల లున్నపుడు ఇరుల
నెన్నుకొనుట ఒక అందము;
తీపిగడియలందు చేదు
జ్ఞాపకమ్ము లొక అందము.

సంయోగములో విరహ
చ్ఛాయలున్న ఒక అందము;
ఆనందములో విషాద
గానమున్న ఒక అందము.

నిండు వసంతమ్ములోన
పండుటాకు లొక అందము;
పున్నమి చంద్రుని చెక్కిట
పుట్టుమచ్చ ఒక అందము.

కాకలీస్వరమున ఇంచు
కంత జీర ఒక అందము;
జలజల పారేటి యేటి
మలుపులోన ఒక అందము.

చావలేక బ్రతుకలేక
సాగలేక ఆగలేక
అటమటించు జీవితాల
కందమేది? అర్థమేది?

ఇంతక్రితం వృద్ధుడు నోట్లు లెక్కబెడుతుండగా అక్కడికి వచ్చి, ప్లాట్‌ఫాంకేసి జారుకున్న తలమాసిన వ్యక్తి, రొప్పుకుంటూ రొజుకుంటూ అక్కడికి పరుగెత్తుకొచ్చాడు. అతని చేతిలో ఓ రొట్టెముక్క ఉంది. అతణ్ణి తరుముకుంటూ ఇద్దరు వ్యక్తులు ప్రవేశించారు. అందులో ఒకడు, తలమాసిన వ్యక్తి తుంటిమీద కాలితో బలంగా ఓ తాపు తన్నాడు. తలమాసిన వ్యక్తి బోర్లబొక్కలా పడ్డాడు. అవకాశాన్ని వినియోగించుకుని ఇద్దరూ అతడిమీది కురికారు.

వృద్ధుడి హృదయం కదిలిపోయింది. బొమికల ప్రోవులా ఉన్న ఆ కుర్రాడి ప్రాణాలను నిలువునా తీస్తారేమో ననిపించింది. కుర్రవాడిమీద జాలీ, వ్యక్తులమీద కోపం పెల్లుబికాయి.

"ఆగండి! ఏమిటీ అఘాయిత్యం? ఎందుకు వాడిమీదలా విరుచుకుపడతారు? మీరు మనుషులు కారా?" అని అరుస్తూ అక్కడికి పరుగెత్తి వాళ్లకు అడ్డుపడ్డాడు. "ఆ కుర్రాడేం చేశాడని? ఎందుకు వాణ్ణలా తంతున్నారు?"

"దొంగవెధవని తన్నక ముద్దుపెట్టుకోమంటారా ఏమిటి?" అన్నాడు ఇద్దరిలో ఒకడు.

"ఏమిటి? దొంగవెధవా? ఏం దొంగిలించాడు బాబూ?"

"ఇంకేం దొంగిలించాలి? రొట్టెముక్క చాలదూ?"

వృద్ధుడు హేళనగా నవ్వేశాడు. "రొట్టెముక్కలూ, కట్టుబట్టలూ దొంగిలించేవాళ్లు దొంగలుకారు బాబూ. దౌర్భాగ్యులు! వాళ్లని చూచి మనం అసహ్యించుకోకూడదు. జాలి పడాలి."

"ఓస్, బయలుదేరాడురా మహా పురుషుడు నీతులు చెప్పడానికి" అన్నాడు వెటకారంగా ఇద్దరిలో ఒకడు.

"ఆ! పోనీరా ముసలాడు. అతనితో పేచీ ఎందుకు? వాడి యోగం బావుంది తప్పించుకున్నాడు. లేకపోతే యీపాటికి అబ్బాయిగారి బుర్ర రామకీర్తన పాడి ఉండేది. పదరా పద! రైలొచ్చే వేళయింది" అన్నాడు మరొకడు.

నిజంగానే రైలుకూత వినిపించింది. ఇద్దరు వ్యక్తులూ అక్కనుంచి ప్లాట్‌ఫాంకేసి పరుగెత్తారు.

వృద్ధుడు తలమాసిన వ్యక్తికేసి చూస్తూ "ఇకలే బాబూ. వాళ్లు వెళ్లిపొయ్యారు" అన్నాడు.

ఆ వ్యక్తి లేచి నిల్చున్నాడు. దిక్కులు చూస్తూ బట్టలు దులుపుకున్నాడు.

చెరిగిన తల, పెరిగిన గడ్డం, చిరిగిన బట్టలు, బొమికల ప్రోవులా ఉన్న అతని శరీరం, ఎక్కడో గుంటల్లో జ్యోతుల్లా వెలిగే కళ్లూ చూస్తూ వృద్ధుడు స్థాణువులా నిల్చుండిపొయ్యాడు. అతనికి పాతికేళ్లకంటే ఎక్కువ ఉండవు.

కుర్రవాడు వృద్ధుడికేసి చూడలేదు. మరో మాటు దిక్కులుచూచి చేతనున్న రొట్టెముక్కను పళ్లతో పీక్కుని అపురూపురుమని తినసాగాడు.

# అదృష్టహీనుడు

వృద్ధుడి కళ్లల్లో నీళ్లు తిరిగాయి. 'పాపం! ఏ తల్లి కన్నబిడ్డో, ఎంత ఆకలిగాఉన్నాడో!' అనుకుంటూ బరువుగా నిట్టూర్చి, మెల్లగా బెంచీ వద్దకు చేరుకున్నాడు. బెంచీమీద కూర్చోబోతుండగా చేతనున్న పర్సు కంటబడింది. వృద్ధుడు ఉలిక్కిపడ్డాడు. ఇంతసేపూ అది తన చేతిలోనే ఉన్న విషయం అతనికి గుర్తులేదు.

'కొంపతీసి దీనిమీద ఎవరూ కన్నేయ్యలేదుగదా?'


వృద్ధుడి గుండెల్లో రైళ్లు పరుగెత్తినాయి. కంగారుగా బాగ్‌లో సర్ది, జిప్‌మూసి, ఎవరూ చూడ్డంలేదుకదా అని హాలంతా కలయజూచి, చెక్కిళ్లపై పోసిన చిరుచెమట్లను తుడుచుకుంటూ బెంచీమీద కూలబడ్డాడు.

కుర్రవాడు సగం రొట్టెముక్కను పీక్కుతిని, మిగిలిన సగం నిక్కరు జేబులో దాచుకుని, అక్కడే ఓ ప్రక్కనున్న ఇనుప స్టాండ్ మీది వాటర్‌పాట్ మర తిప్పి, కడుపునిండా నీళ్లు పట్టించాడు. చేతులు చొక్కాకు తుడుచుకుంటూ ధీమాగా తలెత్తి హాలంతా ఓమాటు కలయజూచి, మహారాజులా అడుగులో అడుగేసుకుంటూ, తిన్నగా వచ్చి వృద్ధుడి ప్రక్కనున్న మరో బెంచీమీద బైఠాయించాడు.

వృద్ధుడు మెల్లగా అతని దగ్గరికి జరిగి, "ఎవరు బాబూ నువ్వు?" అని ప్రశ్నించాడు.

కుర్రవాణ్ణి ఎవరో వీపుమీద ఛెళ్లున చరిచినట్లయింది. 'ఇతగాడి ప్రశ్నకు ఏం జవాబు చెప్పను?' కుర్రవాడు తన్ను తాను ప్రశ్నించుకున్నాడు. వృద్ధుడికేసి వింతగా చూచి ప్రశ్నించింది తన్ను కాదన్నట్లు మరోవైపుకు ముఖం తిప్పుకున్నాడు.

"నిన్నే బాబూ వినిపించడంలేదూ?"



ఒంటరి బ్రతుకు
చిత్రం—బండ్లమూడి పూర్ణచంద్
(హైదరాబాద్-18)

'ముసలివాడు ఒకపట్టాన వదిలేట్టు లేడు. ఎలా?' కుర్రవాడి బుర్రలో మెరుపులాంటి ఆలోచన తళుక్కున మెరిసింది. తనలో తాను నవ్వుకున్నాడు. "నేను. నేనే. దొంగని! కనిపించడం లేదూ?" విసుక్కున్నాడు.

"అది కాదు బాబూ. నీపేరు?"

"ఏమో మరిచిపొయ్యాను. నన్నందరూ దొంగనే పిలుస్తారు. అదే నాపేరు." పరధ్యానంగా జవాబిచ్చాడు.

"పోనీలే బాబూ. పేరులో ఏముంది? ఏదో ఒక పేరు." వృద్ధుడు క్షణం ఆగి "ఇంతకీ దొంగతనం చెయ్యడం తప్పని తెలీదా బాబూ?" అని ప్రశ్నించాడు.

కుర్రవాడు నవ్వాడు. విరగబడి నవ్వాడు. "బలే ప్రశ్న! తప్పులు చేసేవాళ్లు అవి తప్పులని తెలిసికనే చేస్తున్నారనా మీ అభిప్రాయం?" అని ఎదురు ప్రశ్న వేశాడు.

'పాపం! ఎవరో దగాపడ్డ తమ్ముడిలా కనిపిస్తున్నాడు!' వృద్ధుడు బరువుగా నిట్టూర్చాడు.

ఇంతలో టీ త్రాగడానికి ప్లాట్‌ఫాంకేసి వెళ్లిన యువకుడు "ఏమిటి, మేస్టారూ, ఎవరితో మాట్లాడుతున్నారు?" అంటూ అక్కడికి వచ్చాడు.

అతణ్ణి చూడగానే తలమాసిన కుర్రాడి వాలకం మారిపోయింది. ఎందుకో కంగారుగా దిక్కులు చూడసాగాడు.

రెయిన్ కోటు యువకుడు, అతడు కంట పడగానే అగ్గయిపోయాడు. "యూ స్కౌండ్రల్! ఏం చేస్తున్నావురా యిక్కడ? సమయంచూచి దొరికింది చంకన బెట్టుకు పారిపోదామనుకుంటున్నావా? ఊఁ కదులు యిక్కడ్నుంచి." మీసకురికి మెడబట్టి బయటికి గెంటాడు.

"ఆగు బాబూ, ఆగు!" అంటూ వృద్ధుడు అడ్డెళ్లినా ఆగలేదు.

"ఎవరో పాపం! దొంగలా కనిపించడంలేదు. ఒకప్పుడు బాగా బ్రతికినవాడిలాగే కనిపిస్తున్నాడు." వృద్ధుడు బరువుగా నిట్టూరుస్తూ బెంచీమీద కూలబడ్డాడు.

అప్పుడే ప్లాట్‌ఫాంమీద రైలు ఆగింది. పేపరు, బటానీలు, టీ అమ్ముకునే కుర్రాళ్ల కేకలు వినిపిస్తున్నాయి.

యువకుడు పేలవంగా నవ్వాడు. "అవును మేస్టారూ. మీకు వాడి సంగతి తెలిసుంటే అలా అనరు. వాడి వేషంచూచి ఏ బిచ్చగాడో అనుకుంటున్నారు కదూ? అవును. అందరూ అలా అనుకునే మోసపోతూ వుంటారు. సమయానికి నేనిక్కడికి రాబట్టే సరిపోయిందికానీ, లేకపోతే యీపాటికి వాడి నిజస్వరూపం కాస్తా బయటపెట్టే ఉండేవాడు." క్షణం ఆగి దిక్కులు పరికించి, "మీతో చాలా ముఖ్యమయిన విషయం చెప్పాలి. ఇలా వస్తారా?" అన్నాడు.

వృద్ధుడు బెంచీమీదనుంచి లేచి మంత్రముగ్ధుడికి మల్లే అతణ్ణే అనుసరించాడు. యువకుడు అతణ్ణి ఓ మూలకు పిలుచుకుపోయి రహ

న్యంగా "వాడు బిచ్చగాడు కాదు మేస్టారూ! గజదొంగ!" అన్నాడు.

వృద్ధుడు ఉలిక్కిపడ్డాడు. "నిజంగానా?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు. అతని కళ్లల్లో భయాందోళనలు దోబూచులాడినాయి. గుండెలలో గుర్రాలు దవుడుతీసినాయి.

"అవును మేస్టారూ! మీవద్ద డబ్బు ఉందన్న విషయం తెలిస్తే హత్యచేసయినాసరే, అపహరించుకు పోగలడు!"

వృద్ధుడు భయంతో గజగజలాడిపొయ్యాడు.

యువకుడు మాట్లాడకుండా పాంట్ జేబులోంచి పిస్టల్ తీశాడు. వృద్ధుడి కళ్లల్లోకి తీక్ష్ణంగా చూస్తూ పిస్టల్ని వృద్ధుడి గుండెలకు గురిపెట్టాడు.

"ఏమిటి? ఏమిటిది?" వృద్ధుడు కంగారుగా వెనక్కు జరిగాడు.

యువకుడు క్షణం ఆగి బిగ్గరగా నవ్వేశాడు. పిస్టల్‌నుపాంట్‌జేబులో దాచుకుంటూ, "ఎందుకు మేస్టారూ, అలా భయపడిపొయ్యారు? నేను మీమీదికి పేలుస్తాననా? అవును. ప్రాణమంటే అందరికీ తీపే. అసలు అది నా దగ్గరుండడం మీలాంటి అమాయకుల ప్రాణాలని తియ్యడానిక్కాదు. అలాంటి దుర్మార్గుల్ని భయపెట్టేందుకు" అన్నాడు.

"హమ్మయ్య! ఎంత భయపెట్టేశావు బాబూ! నువ్వు నిజంగా నామీదికి పేల్చేస్తావనుకున్నాను సుమా!"

"ఇప్పుడు మీకర్థమై ఉంటుంది, అంతటి గజదొంగ సైతం నన్ను చూడగానే ఎందుకలా కంగారుపడిపొయ్యాడో!"

"అంటే, నీ వద్ద పిస్తోలున్న విషయం వాడికి తెలుసన్నమాట?"

యువకుడు 'అవు' నన్నట్టు తల పంకించి వెనక్కు తిరిగాడు. అప్పుడే అక్కడికివచ్చి బెంచీ వద్ద నిల్చుని ఉన్న వ్యక్తిని చూచి "హల్లో మిస్టర్ గురునాథం! ఈ బండికే దిగబడ్డావేమిటి?" అని ప్రశ్నించాడు.

"ఎవరూ, రామనాథమా? అవునోయ్. ఈ బండికే." ఆ వ్యక్తి చేతనున్న కాన్వాస్‌బాగ్‌ను ప్రక్క బెంచీమీదపెట్టి ముందుకు నడిచి రామనాథాన్ని చేరుకున్నాడు. "నువ్వెక్కడికోయ్ బయలుదేరావ్?" అని ప్రశ్నించాడు.

"అదేమిట్రా? నువ్వేగా తక్షణం బయలు దేరి రమ్మని ఉత్తరం వ్రాసింది?"

"ఏమిటి? బాగానే ఉంది! అయితే రెండో ఉత్తరం నీకందలేదన్నమాట?"

"రెండుత్తరాలు వ్రాశావేమిటి? అసలు నాకు చేరింది ఒక్కటే! ఇంతకీ ఏమిటి విశేషం?"

"ఏముంది? పెళ్లిపని పూర్తయింది. మనం రంగంలోకి దూకడం,పనులు కాకపోవడమూనా?"

"వెరీగుడ్! అయితే మన ప్రయాణం ఆగిపోయినట్టేగా?"

"నిస్సందేహంగా."

"కంగ్రాట్యులేషన్స్!" యువకుడు గురునాథాన్ని కావులించుకుని వృద్ధుడికేసి తిరిగి, "అయాం సారీ మేస్టారూ! వీణ్ణి మీకు పరిచయం చెయ్యడం మరిచాను. నా బాల్య మిత్రుడు. నా బిజినెస్ పార్ట్‌నర్ కూడా. పేరు గురునాథం" అని పరిచయం చేశాడు. "పోతే నా పేరు......" యువకుడు వాక్యం పూర్తి చెయ్యకముందే "రామనాథం!" అని వృద్ధుడు అందుకున్నాడు.

అందరూ నవ్వుకున్నారు.

రామనాథం వెనక్కు తిరిగాడు. బెంచీవద్ద, కాన్వాస్‌బాగుల దగ్గర తచ్చాడుతున్న తలమాసిన కుర్రాడు కనిపించగానే, అతని ముఖంలో కోపం చిందులు తొక్కింది.

"స్కౌండ్రల్! మాటల్లో ఉన్నారు కదా, దొరికింది కాస్తా చంకన బెట్టుకుపోదామని వచ్చావా?" అంటూ పాంట్‌జేబులోంచి పిస్టల్ తీశాడు.

పిస్టల్‌ను చూడగానే కుర్రాడు భయం భయంగా చేతులు పైకెత్తి నిల్చున్నాడు. రామనాథం తిన్నగా అతనివద్దకు చేరుకుని, ఎడంచేత్తో అతని చొక్కా పుచ్చుకున్నాడు. "ఈ ప్రాంతాల ఎక్కడయినా నీ తల కనిపించిందా, ఈ పిస్టల్‌కి పని కల్పించవలసివస్తుంది. జాగ్రత్త! ఇక వెళ్లిపో!" అని బెదిరించి మెడబట్టి బయటికి గెంటేశాడు. "దొంగవెధవ! ఎన్ని గుండెలు వాడికి!" అంటూ వెనక్కుతిరిగి తిన్నగావచ్చి బెంచీమీద కూలబడ్డాడు.

"నువ్వింతక్రితం వాణ్ణి గురించి అంటూంటే ఏమో అనుకున్నాను. వాడు నిజంగా గుండెలు తీసిన బంటులాగే ఉన్నాడు బాబూ!" అన్నాడు వృద్ధుడు, హృదయంలో పెల్లుబికే భయాన్ని బలవంతాన ఆపుకుంటూ.

రామనాథం చిన్నగా నవ్వాడు.


'మనం యిక వెళదామా?' అన్నట్టు చూచాడు గురునాథం.

'అలాగే' అన్నట్టు తలపంకించి రామనాథం బెంచీమీదనుంచిలేచాడు. "మేస్టారూ,నాప్రయాణం ఆగిపోయిందిగా? ఇక మేము సెలవు తీసుకుంటాం" అన్నాడుబెంచీమీది రెయిన్‌కోటునూ, లెదర్‌బాగ్‌నూ అందుకుంటూ.

వృద్ధుడి కళ్లల్లో భయాందోళనలు దోబూచులాడినాయి. 'నన్నిక్కడ ఒంటరిగా విడిచిపెట్టి వెళ్లిపోతారా బాబూ?' అన్నట్టు దీనంగా అతనికేసి చూచాడు.

రామనాథం అతని కళ్లల్లోని భావాన్ని అర్థం చేసుకున్నాడల్లే ఉంది. "మరేం ఫరవాలేదు మాస్టారూ. వాడిక యీప్రాంతాలకే రాడు. నా చేతిలోని పిస్టల్ వాడి దృష్టిపథంలోంచి అంత త్వరగా చెరిగిపోదు. మీరు నిశ్చింతగా ఉండచ్చు. మరో అరగంటలో మీబండికూడా రావచ్చు. వెళ్లొస్తాం. సెలవ్" అంటూ అడుగు ముందుకేశాడు. గురునాథం రామనాథాన్ని అనుసరించాడు.

వృద్ధుడు వాళ్లు వెళ్లినవైపే చూస్తూ



కోటివిద్యలు....

చిత్రం—వెల్లటూరి పూర్ణానందశర్మ (వెల్లటూరు)

నిల్చున్నాడు.

వృద్ధుడి బుర్రలో ఏదో కలుక్కుమంది. బాగ్ ముందుకు లాక్కుని పర్సుకోసం వెతకసాగాడు. కనిపించలేదు. కంగారుగా అందులోని బట్టలన్నీ మరోమాటు బయటికిలాగి బెంచీమీద చిందరవందరగా విరజిమ్మాడు. బాగ్‌ను బోర్లించాడు. పర్సు కనిపిస్తేనా?

ఎక్కడో ఫెళఫెళా ఉరిమింది. కళ్లు మిరుమిట్లు గొలిపేలా ధగధగా మెరిసింది. దగ్గర్లోనే ఎక్కడో పెద్ద శబ్దంతో పిడుగు కూడా పడింది. వృద్ధుడు హఠాత్తుగా కుప్పగా కూలిపొయ్యాడు.

ప్లాట్‌ఫాంమీద ఆగిన రైలు మెల్లగా కదిలింది. సన్నగా యీలవేసి చిన్నగా బుసలు కొట్టుకుంటూ వెళ్లిపోయింది.

ఇంతక్రితం తలమాసిన కుర్రాణ్ణి ప్లాట్‌ఫాం మీంచి తరుముకు వచ్చిన వ్యక్తులిద్దరూ వెయిటింగ్ రూములోకి చేరుకున్నారు. దిగాలుపడి కూర్చున్న వృద్ధుడికేసి చూచి "ఏమిటి బాబూ అలా ఉన్నారు?" అని ప్రశ్నించాడు ఇద్దరిలో ఒకడు.

"ఏముంది బాబూ? జరగవలసినదంతా జరిగిపోయింది. నేను సర్వనాశనం అయిపొయ్యాను. నా పర్సెవడో కొట్టేశాడు. వెయ్యి రూపాయలు బాబూ. కష్టార్జితం!" వృద్ధుడు వలవలా ఏడ్చేశాడు.

"వెయ్యి రూపాయలే!" ఆశ్చర్యాన్ని ప్రకటించాడతడు.

"ఆ దొంగ వెధవ పనే అయ్యుంటుంది!" అన్నాడు మరొకడు.

"దొంగ వెధవ! నమ్మకద్రోహి! ఎంతపని చేశాడు!" వృద్ధుడు అంగలార్చాడు.

"ఊళ్లోకెళ్లి పోలీసు రిపోర్టివ్వండి!" అన్నాడు మొదటి వ్యక్తి.

"మనకెందుకు పదవా! చెబితే వినని వాళ్లని చెడితే చూడమన్నారు. ఇంతక్రితమేగా ఆదొంగాణ్ణి

పై నేమొచ్చిందీ ముసలాడు?" అన్నాడు రెండవ వ్యక్తి.

"అవును బాబూ, అవును! నాకు స్వబుద్ధి లేదు. ఒకరు చెబితే వినేవాణ్ణి కాను. అందుకనే యిలా సర్వనాశనమయ్యాను." వృద్ధుడు తల బాదుకున్నాడు.

ఆ యిద్దరూ తమ దారిన తాము వెళ్ళి పొయ్యారు.

'వెంటనే ఊళ్ళో కెళ్ళి పోలీసు రిపోర్టివ్వాలి. ఆ దొంగ వెధవ అంతు తేల్చుకోవాలి!' అని నిశ్చయించుకున్నాడు వృద్ధుడు. చివాలున బెంచీ మీదనుంచి లేచి బాగ్‌లోంచి బయట విరజిమ్మిన బట్టల్ని సర్దడానికి వంగాడు. ఇంతలో ఎవరో అక్కడికి వచ్చిన చప్పుడవగా తలెత్తి చూచాడు.

అతని గుండెలు కొట్టుకున్నాయి. అతని చేతిలోని బాగ్ క్రింద పడిపోయింది. కళ్ళు బైర్లు కమ్మినాయి. ఎక్కడో పాతాళంలోకి క్రుంగిపోతున్నట్టయింది.

వెంటనే కోలుకున్నాడు. అతని శరీరం ఆపాద మస్తకం కోపంతో గజగజలాడిపోయ్యింది. వెయ్యి సింహాల బలం వచ్చింది. గుండె మేరు పర్వతమైంది.

"నువ్వా? నువ్వు? మళ్ళీ వచ్చావ్? ఎన్ని గుండెలురా నీకు! ఆగు! కదిలావా డొక్కచీరేస్తా! రక్తం తాగేస్తా!" అంటూ ఎరమీది కురికే సింహంలా అమాంతం అతనిమీదికి దూకి అతని చొక్కా పుచ్చుకున్నాడు వృద్ధుడు. "ఏదీ? ఎక్కడ దాచావ్ నా పర్సు? ఊఁ—ఇలా తే!" అని గర్జిస్తూ తలమాసిన కుర్రాణ్ణి ఊపేశాడు.

కుర్రాడు మాట్లాడలేదు.

"మాట్లాడవేం? చెప్పు! చెప్పవా? నీ కుత్తుకకొరికేస్తా! నీ రక్తం తాగేస్తా!" వృద్ధుడు పూనకం వచ్చినవాడిలా ఊగిపోతున్నాడు.

కుర్రాడికి నవ్వాగలేదు.

"నవ్వుతావుట్రా దొంగవెధవా? నీ బ్రతుక్కి నవ్వుకూడానా? నా పర్సిచ్చావా సరేసరి, లేకపోతే ఏం చేస్తానో తెలుసా? నలుగురితో చెప్పి నీ మక్కెలిరగ్గొట్టిస్తాను. పోలీసు రిపోర్టిచ్చి జెయిల్లో పెట్టిస్తాను. చిత్రవధ చేయిస్తాను."

"ఒక్కిది మేష్టారూ! మీరు పోలీసు రిపోర్టివ్వరు. నన్ను జెయిల్లో పెట్టించరు! ఊరికే ఊరిస్తున్నారు. ఇక్కడికంటే ఆ జెయిల్లోనే హాయిగా ఉంటుందేమో! నన్ను జెయిల్లో పెట్టిస్తే నేను సుఖపడిపోతానేమోనని మీ భయం!"

"ఏమిటి? నీకు పోలీసులంటే భయం లేదూ? జెయిలంటే హుషారుగా ఉందేం? దొంగవెధవ! నన్నింకా మోసం చెయ్యాలని చూస్తున్నావ్? అదేం సాగదు. పర్సిచ్చేదాకా విడిచి పెట్టేదిలేదు."

కుర్రవాడు మరోమాటు బిగ్గరగా నవ్వాడు. "అయితే మేష్టారూ, ఆ పర్సుని కొట్టేసింది నేనేనని అనుకుంటున్నారా?" అని ప్రశ్నించాడు.

"ఏం కాదా? కాదని బుకాయించాలను

# అదృష్టహీనుడు

కుంటున్నావా?"

"అవును. కామెర్లరోగికి ప్రపంచమంతా పచ్చగా కనిపించినట్టే, మోసపోయినవాడికి కనిపించినవాడల్లా మోసగాడిలాగానే కనిపిస్తాడు. నేను నిజం చెప్పినా మీరు నమ్మరు."

"ఇంతకీ నువ్వేమంటావ్?" వృద్ధుడు గద్దించాడు.

"మీ పర్సుని నేను దొంగిలించలేదంటాను."

"అబద్ధం! సర్వ అబద్ధం! నా పర్సుని దొంగిలించింది నువ్వే!"

కుర్రాడు క్షణం ఆగి మెల్లగా నవ్వుకున్నాడు. వృద్ధుడి కళ్ళల్లోకి తమాషాగా చూస్తూ "ఇంతకీ మీ పర్సు పోయినమాట వాస్తవమేనా?" అని ప్రశ్నించాడు.

"ఏమిటి? పరాచికాలాడుతున్నావట్రా?"

"అబ్బే. అదికాదు మేష్టారూ! మీరు మీ పర్సుని ఎక్కడ దాచారో అక్కడ ఉందో లేదో బాగా వెతికారా అని అడుగుతున్నా."

"వెతక్కుండానే పర్సుపోయిందనే నిర్ణయాని కొచ్చాననుకున్నావా? నన్ను పిచ్చివాడిక్రింద జమకడుతున్నావా?"

"అవును మేష్టారూ! పిచ్చివాళ్ళు ఇలాగే మాట్లాడుతారు."

"ఓరి బ్రాష్టుడా! ఎంత మాటన్నావ్!" వృద్ధుడు మీదికి ఉరికాడు.

"ఆగండి మేష్టారూ! ఆవేశపడితే ఎలా?" కుర్రాడు వృద్ధుణ్ణి ఆపి "ఇప్పుడు చెప్పండి మేష్టారూ! మీరు మీ పర్సుని ఎక్కడ దాచారు?" అని ప్రశ్నించాడు తాపీగా.

"ఇంకెక్కడ దాస్తానూ? ఆ బాగ్‌లోనే!"

"అబద్ధం! ఒట్టి అబద్ధం. మీరు అసత్య మాడుతున్నారు."

"నేను నీలాగా దొంగను కాదోయ్ అబద్ధ మాడడానికి. నాకు నీ దగ్గర అబద్ధమాడాలిసిన అవసరం లేదు."

"అదీ నిజమే! పెద్దమనుషులు అబద్ధాలాడరుగా? అయితే పొరబాటయి ఉంటుంది. మీరెక్కడో పెట్టేసి మరిచిపోయి ఈ బాగ్‌లోనే పెట్టానని అనుకుంటున్నారు. ఇంతకీ అది మీ బాగ్ కాదుగా? అందులో మీ పర్సు ఎలా దాస్తారు?"

"ఏమిటీ? అది నా బాగ్ కాదూ? నీలాగే ఎక్కడో కొట్టుకొచ్చిన బాపతనుకుంటున్నావా?"

"అలా నేననుకుంటున్నానని మీరెందుకనుకోవాలి? మీకు తెలీకుండానే మీ బాగ్ గల్లంతయి ఉండవచ్చుగా? ఓమాటు ఆ బాగ్‌కేసీ, అందులోంచి విరజిమ్మిన బట్టలకేసీ చూడండి!"

వృద్ధుడు పక్కకు తిరిగి బాగ్‌కేసీ, బయట చిందరవందరగా విరజిమ్మబడిన బట్టలకేసీ చూచాడు. కళ్ళు నలుపుకుని మరీ చూచాడు. అవాక్కయి అలా చూస్తూ నిల్చుండిపొయ్యాడు.

"కంటిపొరలు తొలిగాయా మేష్టారూ! ఆ బాగ్ మీదేనా?" కుర్రాడు హేళనగా వృద్ధుణ్ణి ప్రశ్నించాడు.

"అవును బాబూ, అవును! ఇది నా బాగ్ కాదు. ఈ బట్టలు నావి కావు. నా బాగ్ ఏమైంది?" వృద్ధుడు బిక్కమొహం వేశాడు.

"ఏమైందా? ఈ బాగ్ తెచ్చినవాడితోబాటు మాయమైంది. ఇంతక్రితం ఇక్కడికి వచ్చిన వాళ్ళెవరైనా ఇలాంటి బాగ్‌ని పట్టుకొచ్చారేమో జ్ఞాపకం చేసుకోండి."

వృద్ధుడు క్షణం ఆగి, "ఆఁ—అవును! అతని పేరు గురునాధం!" అన్నాడు జ్ఞాపకం తెచ్చుకుని.

"గుర్తుకొచ్చాడా మేష్టారూ, రామనాధం మిత్రుడు?" కుర్రాడు హేళనగా నవ్వాడు.

"ఏమిటి? గురునాధమా? ఎందుకు తీసు కెళ్ళాడు? పొరబాటునా?" కంగారుగా ప్రశ్నించాడు వృద్ధుడు.

"పొరబాటున కాదు మేష్టారూ, అలవాటునే." కుర్రాడి ముఖం చూస్తుండగానే మారిపోయింది. "ఆ రామనాధమూ, అతని మిత్రుడు గురునాధమూ మీరనుకున్నట్టు పెద్దమనుషులేం కారు మేష్టారూ! వాళ్ళు సంఘంలో పెద్దమనుషులుగా చలామణి అవుతూన్న చీడ పురుగులు. గోముఖ వ్యాఘ్రాలు! నేనీ ఊళ్ళో దిగగానే నావద్ద డబ్బున్నదని పసికట్టి నాతో నేస్తంకట్టి నాకు దుర్వ్యసనాలన్నీ అంటగట్టి, త్రాగించి, తెలివి మైకంలో పడివుండగా నా సర్వస్వాన్నీ దోచుకుని, నన్ను నడివీధికి నెట్టిన దుర్మార్గులు వీళ్ళే! మీ బాగ్ గల్లంతు కావడం పొరబాటున కాదు. వాళ్ళు చెయ్యాలని చేసిన తంతు!" అన్నాడు.

వృద్ధుడు దిగాలుపడి బల్లమీద కూలబడ్డాడు. "అయితే, నా వెయ్యి రూపాయలూ పొయ్యినట్టేనా? నేనా డబ్బుకి నీళ్ళు వదులుకో

(తరువాయి 56 వ పేజీలో)



బికారి

చిత్రం—కృష్ణరావు దేశ్‌పాండే (హైదరాబాద్)

# అదృష్టహీనుడు

( 8 వ పేజీ తరువాయి)

వలసిందేనా?" అంటూ దీనంగా కుర్రాడికేసి చూచాడు.

"పులివాతబడ్డ మేక ప్రాణాలని దక్కించుకొని బ్రతికి బయటపడుతుందా మేష్టారూ?"

వృద్ధుడు చివాలున బెంచీమీందనుంచి లేచి నిల్చున్నాడు. "నేను పోలీసులకి రిపోర్టు చేస్తాను. వాళ్లంతేదో తేల్చుకుంటారు" అని బిగ్గరగా అరుస్తూ ఉద్రేకంలో పిచ్చివాడికి మల్లే చిందులు వెయ్యసాగాడు.

"అనవసరంగా ఉద్రేకపడుతున్నారు మేష్టారూ! మీమాట వినేదెవరు?. మిమ్మల్ని పిచ్చివాడి క్రింద జమకడుతుంది లోకం! సంఘంలో వాళ్లకెంత విలువవుందో మీకు తెలీదు. వాళ్ళని దొంగిలించారంటే ఎవరూ నమ్మరు."

"అంతేనా బాబూ? అంతేనా?" వృద్ధుడు చప్పచల్లారిపోయి కుప్పలా కూలిపోయ్యాడు. "ఎంత మోసపోయ్యాను!" తల గట్టిగా పట్టుకున్నాడు. అతని చెంపమీదనుంచి అశ్రువులు కాలువలు గట్టాయి.

కుర్రాడి కళ్లల్లోకూడా నీళ్లు తిరిగాయి. మెల్లగా వృద్ధుణ్ణి సమీపించి "దుఃఖించకండి మేష్టారూ! మోసపోయ్యింది మీరు కాదు; మొనగాళ్లమనుకుంటోన్న మోసగాళ్లు" అన్నాడు.

"ఏమిటి?" వృద్ధుడు ఆశ్చర్యంగా తలెత్తి కుర్రాడి ముఖంలోకి చూచాడు వింతగా.

"అవును మేష్టారూ! మీ డబ్బు ఎక్కడికీ పోలేదు. మీవద్దనే సురక్షితంగా ఉంది!"

వృద్ధుడికి ఏమీ అర్థం కాలేదు. "ఎక్కడ బాబూ! ఎక్కడ?" అని ప్రశ్నించాడు.

"మీకోటు జేబులో."

"ఏమిటి? నాకోటు జేబులోనా?" బెంచీ మీద ఆరవేసివున్న కోటును ఆత్రంగా అందుకుని జేబులు వెతికాడు. ఒక జేబులో పర్సు దొరికింది. సంభ్రమాశ్చర్యాలతో అతని ముఖం వికసించింది. "ఏమిటీ విచిత్రం! ఈ పర్సు కోటు జేబులో కెలావచ్చింది? ఏమిటి బాబూ యిదంతా?" అని అంటూ స్థాణువులా నిల్చుండిపోయ్యాడు.

కుర్రాడి పెదవులమీద చిరుహాసం లాస్యం చేసింది. "ఇందులో ఆశ్చర్యపడవలసిన విషయం ఏమీలేదు, మేష్టారూ! ఆ పర్సుని బాగ్‌లోంచి తీసి కోటుజేబులో వేసింది నేనే" అన్నాడు.

"ఏమిటి?"

"అవును. మీ పర్సులో డబ్బున్న విషయం నాకు తెలుసు. మీరు నోట్లు లెక్కపెట్టు కుంటుండగా నేను చూచాను. నా సమక్షంలోనే మీరా పర్సుని బాగ్‌లో దాచారు. మనంమాటాడు తుండగా రామనాధం ఇక్కడికి వచ్చాడు. మీతో బాగా పరిచయమున్న వ్యక్తిలా వ్యవహరించాడు. మీవద్దనున్న డబ్బుని కాస్త అపహరించడానికి వాడేదో ఎత్తువేస్తున్నాడని నేనప్పుడే అనుమానించాను. వాడికి భయపడి పారిపోయినట్టు నటించి, పంచలో పొంచుని, ఏం జరుగుతుందో గమనిస్తున్నాను. ఇంతలో రామనాధం మిత్రుడు గురునాధం కనిపించాడు. అతని చేతిలో అచ్చం మీ బాగ్‌లాంటిదే ఉంది. దాన్ని చూడగానే వాళ్లాడబోయ్యే నాటకమంతా ఊహించుకున్నాను. గురునాధం హాల్లోకి ప్రవేశించాడు. తిన్నగా బెంచీవద్దకి చేరుకుని మీ బాగ్‌తీసి పక్క బెంచీమీద పెట్టి తన చేతనున్న బాగ్‌ని మీబాగ్ స్థానంలో ఉంచాడు. అటు తిరిగి రామనాధంతో మాట్లాడుతున్న మీరు ఈ విషయాన్ని గమనించలేదు. తరువాత రామనాధం గురునాధాన్ని పలకరించడం, అతడు మిమ్మల్ని చేరుకోవడం జరిగింది. మీరందరూ మాటల్లో పడ్డారు. అంతదాకా బయటపొంచునియిదంతా గమనిస్తోన్న నేను, మెల్లగా వచ్చి మీ బాగ్‌లోంచి పర్సుని బయటికితీసి, మీ కోటుజేబులో దాచి, వెళ్లబోతుండగా రామనాధం నన్ను చూచాడు. నేను బాగ్‌లోంచి పర్సుని తీసి కోటు జేబులో దాచిన విషయం రామనాధం పసికట్టాడేమోనని, నా ప్రయత్నం విఫలమవుతుందేమోనని భయపడ్డాను. కాని, రామనాధం నా కార్యాన్ని గుర్తించలేదు."

"బాబూ!" వృద్ధుడు అమాంతం కుర్రాణ్ణి కౌగిలించుకున్నాడు. అతని కళ్లల్లోంచి ఆనంద బాష్పాలు రాలాయి. "నువ్వు మామూలు మనిషివి కావు బాబూ! నాపాలిటి దైవానివి! నిన్ను అనవసరంగా అనుమానించాను. నోటికొచ్చినట్టు తూలనాడాను. నన్ను క్షమించు బాబూ!"

"పెద్దవారు! మీరలాఅనకూడదు మేష్టారూ. నేను మీకళ్లకి దొంగలా కనిపించానంటే ఆలోపం మీదికాదు. నా వేషానిది! వేషం చూచి మోసపోవడం మానవనైజం!"

"నిజమే బాబూ, నిజమే. నిజాన్ని గ్రహించడం నీతులు చెప్పేంత తేలికకాదు." వృద్ధుడు పైపంచెతో కళ్లు తుడుచుకుని కుర్రాడికేసి ఆపాదమస్తకం పరిశీలనగా చూచాడు. "నిన్ను చూస్తోంటే ఏ ఆప్త బంధువునో చూస్తున్నట్టని పిస్తోంది. నీ మాటలు వింటోంటే ఐదేళ్ల క్రితం చనిపోయిన నా సత్యం గుర్తుకొస్తున్నాడు. ఇంతకీ నువ్వెవరు బాబూ?"

వంకర దారి

ఫోటో—ఆర్. బి. షిండే (కొల్హాపూర్)



కుర్రాడి ముఖంలో రంగులు మారాయి. బరువుగా నిట్టూర్చాడు. "ఏం చెప్పమంటారు మేష్టారూ! నేనెవరో నాకు తెలీదు. కనీసం నా పేరు సైతం నాకు జ్ఞాపకంలేదు" అన్నాడు శూన్యంలోకి దృక్కులు నిగిడ్చి.

"అదేమిటి బాబూ!" వృద్ధుడు వింతగా అతనికేసి చూచాడు.

"నిజం మేష్టారూ! నేను అబద్ధమాడ్డం లేదు."

వృద్ధుడికి ఏమీ అర్థంకాలేదు.

"రైలుప్రమాదం అంటూంటే జ్ఞాపకం వచ్చింది. నాలుగయిదేళ్ళక్రితం, ఒకనాటి రాత్రి నేను ఓ చిట్టడవిలో ఒక నది ఒడ్డున నిద్రలేచాను. కళ్లుతెరిచి చూచేసరికి మసక వెన్నెల్లో కూలిన వంతెన, వంతెనమీదనుంచి నదిలోకి ఏనుగులా దిగబడిన రైలింజనూ, తునాతునకలై నదిలో కొట్టుకుపోయినవి పోగా మిగిలిన రైలుపెట్టెలూ, రోదచేసుకుంటూ ప్రవహించే నదీ కనిపించినాయి. చీకటి పురుగుల వికృతధ్వనులూ, వికలాంగుల భయంకర రోదనలూ వినిపించినాయి. నాకెందుకో అక్కడుండడానికి భయమేసింది. అక్కడినుంచి పారిపోవాలని పైకిలేచాను. కాని నా అవయవాలు నావశంలో లేవు. ఎలాగో శక్తిని కూడదీసుకుని అడుగు ముందువేశాను. రాయీ రప్పా దాటుకుంటూ, ముళ్లూ ముడకా తొక్కుకుంటూ ఎంతసేపలా నడిచానో గుర్తులేదు. చివరికి ఓ రాచబాటమీద స్పృహతప్పి పడిపోయ్యాను. నేను కళ్ళుతెరిచి చూచేసరికి ఓ డిస్పెన్సరీలో ఉన్నాను. నా ఒళ్లంతా కట్లతో నిండి ఉంది.

"నేను స్పృహతప్పి రోడ్డుమీద పడివుండగా అర్జెంటుపనిమీద ఆ దారంట వెళుతున్న డాక్టర్ బెనర్జీ మహాశయుడు నన్ను చూడడం, తనతో కలకత్తాకు తీసుకుపోయి డిస్పెన్సరీలో చేర్చడం జరిగింది. నా శరీరంమీద గాయాలు త్వరలోనే మానిపోయినాయి. కాని, ఏం ప్రయోజనం? నా జ్ఞాపకశక్తిని కోల్పోయ్యాను. గతమేదీ నాకు జ్ఞాపకంలేదు. నేనెవరినో, ఎక్కడుండేవాడినో, ఏంచేసేవాడినో తెలీదు. నా పేరు సైతం నాకు గుర్తులేదు. డాక్టర్ నా నిస్సహాయ స్థితిని చూచి చాలా జాలిపడ్డారు. నన్ను మామూలు మనిషిని చెయ్యడానికి ఎంతో ప్రయత్నించారు. కాని, వారి ప్రయత్నం ఫలించలేదు. వారే జీవనోపాధికి నాకో ఉద్యోగం చూపారు. ఆంధ్రదేశమంతా ఓ మాటు తిరిగితే నాకు పరిచయమయిన పరిసరాలో, వ్యక్తులో కనిపించినప్పుడు నేను నా జ్ఞాపకశక్తిని పుంజుకోవడానికి ఆస్కారముందని సలహా ఇచ్చారు. ఆ సలహాప్రకారమే ఇంతకాలం ఉద్యోగం చేసి కూడబెట్టిన డబ్బుతో ఆంధ్రదేశ పర్యటనకు బయులుదేరాను. ఈ స్టేషన్నీ, ఈ పరిసరాలనూ ఎప్పుడో చూచినట్టు గుర్తుకువచ్చి ఇక్కడ దిగాను. నావద్ద డబ్బున్నదన్న విషయం పసికట్టిన రామనాథం అండ్ కంపెనీ నాతో స్నేహం కట్టి, నన్ను మోసంచేసి నా సర్వస్వాన్నీ దోచుకుని నడివీధిలోకి నెట్టారు. ఇక్కడ ఈ స్థితిలో దాదాపు నెల రోజులుగా ఇలా తిరుగుతున్నాను" అని బరువుగా నిట్టూర్చాడు.

అంతక్రితమే అక్కడికివచ్చి అతడు చెప్పిందంతా విన్న పాతికేళ్ల కుర్రాడు ముందుకువచ్చి "నీకీ స్ఫోటకంపోసి ఎంతకాలమైంది?" అని అడిగాడు.

"నా ఒంటిమీది గాయాలు మానిన మరునటి మాసమే నాకు స్ఫోటకం పోసింది. నా రూపాన్ని పూర్తిగా మార్చేసింది!" అన్నాడు కుర్రాడు. వెనక్కుతిరిగి తన్ను ప్రశ్నించిన వ్యక్తికేసి చూచి స్థాణువులా నిల్చుండిపోయ్యాడు.

ఆ వ్యక్తి ముఖం వికసించింది. "నన్ను బాగా చూడు! నేనెవరో నీకు గుర్తున్నానా?" అని ప్రశ్నించాడు కుర్రవాణ్ణి.

"ఆఁ....అవును!.....నీ పేరు రామ్మూర్తి!" కుర్రవాడి ముఖంకూడా వికసించింది.

"ఎవరూ? నువ్వటోయ్ రామూ! అతణ్ణి నువ్వెరుగుదువా?" అని ప్రశ్నించాడు వృద్ధుడు ఆ కొత్త వ్యక్తిని.

"అవును మేష్టారూ! నేనతణ్ణి ఎరుగుదును! నేనేకాదు మేష్టారూ, మీరుకూడా అతణ్ణి బాగా ఎరుగుదురు. మీ వృద్ధాప్యం, స్ఫోటకంవల్ల అతని రూపంలో కలిగిన మార్పూ, మీరతణ్ణి గుర్తుపట్టకపోవడానికి కారణాలుగా పనిచేసి ఉంటాయి."

"అవును బాబూ, అవును. ఆ గొంతూ ఆ మాటతీరూ వింటోంటే బాగా పరిచయమున్న వ్యక్తిలాగే ఉన్నాడు. ఇంతకీ ఎవరు చెప్మా!" వృద్ధుడు కుర్రవాడికేసి తిరిగి "నువ్వన్నా నన్ను గుర్తుపట్టావా బాబూ!" అని ప్రశ్నించాడు.

"మిమ్మల్ని మొట్టమొదటిసారిగా చూచినప్పుడే గుర్తుపట్టాను." కుర్రాడు తలవంచుకుని జవాబిచ్చాడు.

"ఏమిటి? ఇంతసేపూ ఆ విషయం చెప్పకుండానే దాచావ్? బాగానే ఉంది! అయితే నువ్వు నాదగ్గర చదువుకున్నావా బాబూ?"

కుర్రాడు మాట్లాడలేదు. వంచిన తల ఎత్తలేదు.


రామ్మూర్తి జాలిగా వృద్ధుడికేసి చూచాడు. "మేష్టారూ! మీరింకా అతణ్ణి గుర్తుపట్టలేదా? అతడు నా బాల్యమిత్రుడు! మీ కుమారుడు! సత్యం! మేష్టారూ సత్యం!" అన్నాడు.

వృద్ధుడు ఉలిక్కిపడ్డాడు. "ఏమిటి? సత్యమా? నా కుమారుడు సత్యమా? నా సత్యం బ్రతికే ఉన్నాడా?" గుండెలు పట్టుకుని, నిలువుగుడ్లేసి, నిల్చున్నపళాన నేలగూలాడు.

"నాన్నా!" అంటూ సత్యం వృద్ధుడిమీదికి వాలాడు.

ఆకాశం ఫెళఫెళా ఉరిమింది.

సత్యం గుండెల్లో పిడుగుపడింది. ★



గొల్ల—తల్లి—పిల్ల

చిత్రం—ఎం. శంకరరావు (అన్నా